ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
5
గురువారం 24 జూలై 2025

హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న సిబ్బంది



గండి హుండీ ఆదాయం రూ.6.55 లక్షలు

చక్రాయపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో ఉన్న ఏడు శాశ్వత హుండీల ద్వారా రూ.6,55,549 ఆదాయం వచ్చిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం గండి ఆవరణంలో లెక్కింపు నిర్వహించామని, ఇందులో రూ.6,55,549 నగదు, 0.019 గ్రాముల మిక్స్‌డ్ బంగారు వస్తువులు, 0.007 గ్రాముల మిక్స్‌డ్ వెండి, 1/4 కువైత్ దినార్లు 11తో పాటు అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.7,453 వచ్చినట్లు తెలిపారు. మొత్తం 34 రోజులకు లెక్కించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి మల్లికార్జునప్రసాద్, పోలీసులు, దేవస్థాన మాజీ ఛైర్మన్ వెంకటస్వామి, ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి, ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్, బ్యాంకు సిబ్బంది, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.16 లక్షలకు టోల్‌గేట్ వసూలుకు టెండర్

చక్రాయపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గండి దేవస్థానంలో ఏడాది పాటు టోల్‌గేట్ వసూలుకు టెండర్ నిర్వహించగా రూ.16.10 లక్షలకు వీరపునాయునిపల్లె మండలం అలిదెన గ్రామానికి చెందిన ఎం.అశోక్‌రెడ్డి టెండర్ దక్కించుకున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం గండిక్షేత్రంలో టెండర్లు నిర్వహించారు. అలాగే శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణ చేసే హక్కుకు సంబంధించి సీల్డ్ టెండర్లు పిలువగా ఎవరూ దాఖలు చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి మల్లికార్జున ప్రసాద్, దేవస్థాన మాజీ ఛైర్మన్ వెంకటస్వామి, ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి, ఆలయ సూపరింటెండెంట్ సుభాష్, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో పకడ్బందీ చర్యలు

- రాయలసీమ జైళ్లశాఖ ఇన్‌చార్జ్ డీఐజీ రవికిరణ్



కడప క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): కడప కేంద్ర కారాగారంలో గత కొన్నిరోజులుగా సెల్‌ఫోన్లు దొరుకుతున్న నేపథ్యంలో విచారణ చేపట్టి పకడ్బందీ చర్యలు చేపడు తున్నామని రాయలసీమ జైళ్ల శాఖ ఇన్‌చార్జ్ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ తెలిపా రు. బుధవారం తమ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కడప కేంద్ర కారాగారంలో ఇప్పటివరకు లభిం చిన సెల్‌ఫోన్లు బయట వైపు నుంచి విసిరి వేస్తున్నట్లు ప్రాథమికంగా తెలిసిందన్నారు. రిమాండు ఖైదీ జాకీరును ప్రత్యేక సెల్‌లో ఉంచామని తెలిపారు. సెల్‌ఫోన్లు దొరికిన సమయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లు, ఇద్దరు జైలర్లు, ముగ్గురు జైలు వార్డర్లపై రాష్ట్ర డీజీ సస్పెన్షన్ వేటు వేశారన్నారు. ఇంకా విచారణ కొనసాగుతుందని తెలిపారు.

చీనీ వ్యాపారంపై సీఎం పేషీ ఆరా


- కలెక్టర్ సూచనతో మార్కెట్ యార్డును పరిశీలించిన బీటెక్ రవి, డీహెచ్ఓ

పులివెందుల, జూలై 23(ఆంధ్రజ్యోతి): పులివెందుల మార్కెట్ యార్డులో సాగుతున్న చీనీ వ్యాపారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. 'పతనమైన చీనీ ధరలు' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. ఈ విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి వెళ్లడంతో అక్కడ సీఎంఓలో చర్చకు వచ్చింది. ఉద్యానశాఖ కమిషనర్ నుంచి జిల్లా కలెక్టర్‌కు మార్కెట్ యార్డులో జరుగుతున్న వ్యాపారంపై పరిశీలించాలని ఆదేశాలు అందినట్లు తెలిసింది. దీంతో బుధవారం పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవితో పాటు జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అక్కడి వ్యాపారస్తులతో చర్చించారు. చీనీపంట పచ్చిసరుకు కావడంతో మార్కెట్‌యార్డుకు తెచ్చినప్పుడు ధర తక్కువున్నా వాటిని వెనక్కి తీసుకెళ్లలేక వచ్చిన ధర చాలని రైతులు అమ్మాల్సిన పరిస్థితి ఉంటోందని బీటెక్ రవి పేర్కొన్నారు. ముందు నెలలో రూ.40 వేలు, రూ.50 వేలు ఉన్న చీనీ ధర ప్రస్తుతం రూ.15వేలు, రూ.20వేలు మాత్రమే ఉందన్నారు. ధర హెచ్చుతగ్గులు ఉండడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, సిండికేట్ వ్యాపారం చేయడం కరెక్ట్ కాదని ఆయన హెచ్చరించారు. ఇకమీదట ప్రతివారం మార్కెట్ యార్డును పరిశీలిస్తానన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ రైతులకు మంచి ధర వచ్చేలా చూడాలన్నారు. వారికి నష్టం కలిగేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.




చీనీ కాయలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, బీటెక్ రవి

డ్వాక్రా సంఘాలపై ఫోకస్



- రహస్యంగా సాగుతున్న విచారణ
- వైసీపీ హయాంలో భారీ అక్రమాలు
- 500 వరకు తేలిన బోగస్ గ్రూపులు
- రూ.70 నుంచి 80 కోట్ల మేర తీసుకున్న రుణాలు
- బయటకు రాకుండా తొక్కిపెడుతున్న అధికారులు

ప్రొద్దుటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో బోగస్ డ్వాక్రా సంఘాలు పెద్ద ఎత్తున వెలిశాయి. ఆ ప్రభుత్వంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. దాదాపు 500 వరకు బోగస్ గ్రూపులు రూ.70 నుంచి రూ.80 కోట్ల మేర రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా ఈ బోగస్ డ్వాక్రా సంఘాలపై ప్రభుత్వం రహస్యంగా విచా రణ మొదలుపెట్టింది. గత వైసీపీ ప్రభుత్వం డ్వా క్రా గ్రూపులన్నీ జాతీయ బ్యాంకుల నుంచి ఖాతాలను రద్దు చేసుకొని జిల్లా కేంద్ర సహకారం బ్యాంకుల్లో ఖాతాలు ప్రారంభిస్తే రుణాలు అంద జేస్తామని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఆప్కాబ్‌ను బలోపేతం చేయడంలో భాగంగా ఈ బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు ప్రారంభిస్తే వెంటనే డ్వాక్రా సంఘాలకు రుణాలు అందజేస్తామని చెప్పారు. దీంతో డ్వాక్రా సంఘాలు జాతీయ బ్యాంకుల్లో ఖాతాలు రద్దు చేసుకోకుండా వున్న గ్రూపు సభ్యుల పేర్లతో డీసీసీ బ్యాంకుల్లో కొత్త ఖాతాలను ప్రారంభించారు. అక్కడ రుణాలు పొందారు. అలాగే రెండు వేర్వేరు జాతీయ బ్యాంకుల్లో కూడా ఒకే గ్రూపులో వున్న సభ్యులతోనే రెండు గ్రూపులుగా చూపెట్టి కొత్త ఖాతాలు ప్రారంభించి రూ.కోట్ల రుణాలు పొందారు. అయితే ఈ గ్రూపులు మెప్మా కార్యాలయ రికార్డుల్లో నమోదయ్యాయా లేదా అని విచారించారు. బోగస్ గ్రూపుల ద్వారా బ్యాంకుల నుంచి కోట్ల రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు.



గుట్టు రట్టు.. ఏమైనట్టు ?

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వైసీపీ సర్కారులో అక్రమంగా రుణాలు పొంది బ్యాంకులకు కట్టకుండా ఉన్న వారి వివరాలు గుట్టు రట్టు చేస్తానని మెప్మా టీఈ మహాలక్ష్మీ నవంబరు 30న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వెల్లడించారు. దాదాపు 1300 గ్రూపుల డేటా సరిగా లేదని, వాటిని ఆన్‌లైన్ ద్వారా పరిశీలించి నిజాలు నిగ్గుతేల్చుతామని చెప్పింది. ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటికీ ఆమె ఆ అక్రమాలపై నోరు విప్పకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. నివేదికను మున్సిపల్ కమిషనర్‌కు సైతం ఇప్పటికీ అందజేయలేదని తెలుస్తోంది. కాగా ఈ అధికారిణి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్పీలతో సన్నిహితంగా వుండడం వల్లే అక్రమాలను బహిర్గతం చేయడం లేదనే ఆరోపణలు వినపడుతున్నాయి.

మెప్మా అక్రమాలపై మౌనమేల ?

బోగస్ డ్వాక్రా సంఘాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకున్నా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మౌనంగా ఎందుకు వున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఇందులో కొందరు ఆర్పీలు అధికార పార్టీకి చెందిన వారేమైనా వున్నారా అని ప్రచారం సాగుతోంది.

గ్రూపు సభ్యులకు తెలియకుండా కుట్ర

కొందరు మెప్మా ఆర్పీలు అక్రమాలు చేయడంలో ఆరితేరారు. వారు ఏకంగా గ్రూపు లీడర్లను చేతిలో పెట్టుకొని గ్రూపు సభ్యులెవ్వరికీ తెలియకుండా వారి ఆధార్‌నెంబర్ల పేర్లతో కొత్త గ్రూపు సృష్టించి బ్యాంకుల్లో అధికారులతో మాట్లాడుకొని గ్రూపునకు లక్షల రుణాలు పొందారు. ఇందులో సీవోలు సైతం కొందరు కుమ్మక్కై సంతకాలు పెడితే కొందరు ఫోర్జరీ సంతకాలతో బ్యాంకు రుణాలు పొందినట్లు ఆరోపణలున్నాయి. కొందరు ఆర్పీలు ఏకంగా మెప్మా పట్టణ అధికారిణి టీఈని చేతిలో పెట్టుకొని సంబంధిత గ్రూపులకు సీవో సంతకాలు లేకున్నా ఏకంగా టీఈ సంతకాలతో పాతిక గ్రూపుల దాకా రుణాలు పొందారని మెప్మా కార్యాలయంలోనే ప్రచారం సాగుతున్నది. ఈ అక్రమాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి అరికట్టాల్సిన సీవోలు, టీఈ స్థాయి అధికారులు కాసుల కోసం కక్కుర్తి పడి ఈ అక్రమాలు నడిపించారనే ఆరోపణలున్నాయి.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో 2927వరకు డ్వాక్రా గ్రూపులు వున్నాయి. ఇవికాకుండా వైసీపీ హయాంలో దాదాపు 500 గ్రూపుల వరకు బోగస్ గ్రూపులు ఏర్పడినట్లు మెప్మాలోని వర్గాలే చెబుతున్నాయి. ముఖ్యంగా రామేశ్వరం, వసంతపేట శ్రీనివాసనగర్, దస్తగిరిపేట తదితర ప్రాంతాలకు చెందిన ఆర్పీలు ఇందులో కీలకంగా వున్నట్లు సమాచారం. మొత్తం 95 మంది ఆర్పీలు ఉండగా 25మంది ఆర్పీలు బోగస్ గ్రూపులు ఏర్పాటు చేసి భారీగా రుణాలు పొందారని తెలుస్తోంది. ఈ రుణాల్లో సీవోలకు, టీఈలకు వాటాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. కొందరు ఆర్పీలు రెండు మూడు కోట్ల వరకు అక్రమంగా రుణాలు పొంది వాటిని కట్టకుండా ఇతర వ్యాపారాల్లో పెట్టుకొని లక్షలు ఆర్జిస్తున్నట్లు సమాచారం. ఇందులో రామేశ్వరానికి చెందిన ఓ ఆర్పీ ఏకంగా రూ.2 నుంచి 3 కోట్ల మేర బోగస్ రుణాలు తీసుకొని అక్రమాలు సాగించినట్లు చెబుతున్నారు.

వారం క్రితం రహస్యంగా విచారణ

ఈ నెల 15న మున్సిపల్ హైస్కూల్లోని స్త్రీశక్తి భవన్‌లో బోగస్ డ్వాక్రా గ్రూపులపై కొందరు ఆర్పీలను మెప్మా అధికారులు రహస్యంగా విచారించినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీలో వున్న మెప్మా కార్యాలయానికి రాకుండా స్త్రీశక్తి భవన్‌లో ఒక్కో ఆర్పీని ఎన్ని బోగస్ డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేశారని ఆరా తీసినట్లు సమాచారం. అయితే పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన ఆర్పీలు మాత్రం ఆ విచారణకు హాజరుకాలేదని తెలిసింది. ఇప్పటికైనా మెప్మా అధికారులు ఈ బోగస్ గ్రూపుల అక్రమాలను వెలికితీసి ఎన్ని కోట్ల అక్రమాలకు పాల్పడింది బహిర్గతం చేయాలని డ్వాక్రా మహిళలు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- పీ4 అమలు పటిష్టంగా జరగాలి
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో జిల్లాలో ర్యాంప్ కార్యక్రమం, పీ4, సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ కార్యక్రమాల అమలు నిర్వహణపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడులతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలను ఆర్థికంగా బలోపేతం చేసి పారిశ్రామికంగా జిల్లాను అభి వృద్ధి చేయడం కోసం ర్యాంప్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించేందుకు జిల్లాలో ఇప్పటికే బంగారు కుటుంబాలను సర్వే, గ్రామ సభల ద్వారా గుర్తించామని, ఎంఎస్ఎంఈల పనితీరును పెంచడం వేగవంతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జిల్లాలో ఉద్యం వర్క్‌షాపులను నిర్వహించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టాలన్నారు. పీ4-పథకంలో భాగంగా సీఎం సూచనల మేరకు జిల్లాలో ఇప్పటికే 78 వేల బంగారు కుటుంబాలను గుర్తించామని, దాదాపు 10 వేల మందిని ఎంపిక చేసిన మార్గదర్శుల ద్వారా దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. ఆగస్టు 5 నాటికి సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామ సభలు నిర్వహించి జాబితాను తయారు చేయనున్నామన్నారు. కడప మున్సిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ రాష్ట్రానికి ఆదర్శమన్నారు. ఈ కిచెన్ నుంచే వచ్చే ఏడాది పలు పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు మనోజ్‌రెడ్డి, కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు ఆర్డీవో జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, చంద్రమోహన్, సీపీవో హజరత్తయ్య, డీఆర్డీఏ, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, అధికారులు పాల్గొన్నారు.

పెన్నానదికి భారీగా వరద నీరు

సిద్దవటం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పెన్నానది పరవళ్లు తొక్కుతోంది. దీంతో నదిలో ఎవరూ దిగకుండా పోలీసు యం త్రాంగం అప్రమత్తమైంది. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్‌రఫి మాట్లాడుతూ పెన్నానదికి రెండు రోజులుగా వరదనీరు భారీగా చేరుతోందని, పెన్నానది ప్రాంతా ల్లో చేపలు పట్టే జాలర్లు ఎవరూ వేటకు వెళ్లవద్దని, నదిలోకి ఎవరూ దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. జ్యోతి, ఆకులవీధి, వంతాటిపల్లె, గొల్లపల్లె తదితర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దవటం కాజ్‌వే వంతెన వద్ద ఇద్దరు పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీటెక్ రవి



కడప ఎర్రముక్కపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై వ్యక్తిగతంగా దూషించినా, విమర్శించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి వైసీపీ నాయకులు సతీష్‌రెడ్డిని హెచ్చరించారు. భవిష్యత్తులో తీవ్రపరిణామాలు ఉంటాయని సూచించారు. బుధవారం కడప నగరం ద్వారకా నగర్‌లోని తన నివాసంలో టీడీపీ నాయకుడు బీటెక్ రవి విలేకరులతో మాట్లాడారు. టీడీపీలో 25 సంవత్సరాల పాటు ఉంటూ ఆ పార్టీ ద్వారా గుర్తింపు పొందిన సతీష్‌రెడ్డి నేడు వైసీపీ పంచన చేరి సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌లను విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి తనకు నచ్చిన పార్టీ లో ఉండే స్వేచ్ఛ ఉంటుందని, ఆ పార్టీ సిద్ధాంతాలను తెలియజేసుకో వచ్చన్నారు. అయితే సతీష్‌రెడ్డి సుదీర్ఘకాలంగా టీడీపీలో ఉంటూ ఆ పార్టీ తరఫున ఐదుసార్లు పోటీ చేసేందుకు టికెట్ ఇవ్వడమే కాకుండా ఎమ్మెల్సీని చేసి కేబినెట్ హోదా ఇవ్వడం జరిగిందన్నారు. పులివెందులకు రూ.500 కోట్లు పెట్టి నీళ్లిచ్చి వైఎస్ కుటుంబం చేయలేని పనిని చంద్రబాబు చేశారని కొనియాడారు. గతంలో వేల్పుల సంఘటనకు సంబంధించి సతీష్‌రెడ్డిపై హత్యానేరం మోపింది ఎవరో ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికి కూడా ఆ కేసు పెండింగ్‌లోనే ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మెప్పుకోసం తన ఇమేజ్ తగ్గించుకోవద్దని, ప్రజలు దీన్ని ఆమోదించరన్నారు.

అక్రమాలపై థర్డ్ పార్టీ బృందం తనిఖీలు

ప్రొద్దుటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పన్ను విధింపుల్లో అక్రమాలపై పలు కట్టడాలను థర్డ్ పార్టీ బృందం తనిఖీలు చేపట్టింది. బుధవారం మున్సిపల్ డీఎంఏ ఆర్డీఎంఏ ఆదేశాల మేరకు పులివెందుల ఆర్‌వో మునికుమార్, జమ్మలమడుగు ఆర్ఐ శ్రీనివాసులు, రాజంపేట ఆర్ఐ సుబ్బరాయుడు, 9 మంది అడ్మిన్ ప్లానింగ్ సెక్రటరీలు థర్డ్ పార్టీ బృందం పట్టణంలోని ఎస్ఎస్ మాల్‌లో గదులకు వేసిన పన్నులను పరిశీలించారు. వాటి కొలతలను సరిచూశారు. ప్రొద్దుటూరులో 80 అండర్ అసెస్‌మెంట్లు ఆన్‌లైన్ ద్వారా వెల్లడికావడంతో ఈ 80 అసెస్‌మెంట్లను క్షేత్రస్థాయిలో కొలతలు పరిశీలించి పన్ను ఎందుకు తక్కువ విధింపు జరిగింది. ఇందులో ఏమైనా అక్రమాలు జరిగాయా అనేది విచారిస్తామని ఆర్‌వో మునికుమార్ తెలిపారు. అలాగే అడిషనల్ ఆల్ట్రేషన్‌లో పన్ను తగ్గిన కట్టడాలను కూడా క్షేత్రస్థాయిలో కొలతలు తీస్తామన్నారు. మెజర్‌మెంట్లు ఏమైనా తగ్గించారా అనే కోణంలో విచారిస్తామన్నారు. వీటన్నింటికి రిమార్కులు వుంటే రాసి డీఎంఏ ఆర్డీఎంకు నివేదిక పంపుతామని వారు తెలిపారు.

బాలిక హత్య మిస్టరీ వీడేనా..?



జమ్మలమడుగు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గండికోటలో ఈ నెల 14న జరిగిన బాలిక హత్య మిస్టరీ ఎప్పుడు వీడుతుందా అని ఎదురు చూస్తున్నారు. పోలీసులు ఇప్పటి వరకు దాదాపు 400 మందికి పైగా విచారించినట్లుగా తెలుస్తోంది. గండికోటకు ఈ నెల 10 నుంచి 14వ తేది వరకు ఎవరెవరు వచ్చారనే వివరాలపై ఆరా తీస్తున్నారు. హత్యకు సంబంధించిన జాడ లభించకపోవడంతో పోలీసు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కాగా బుధవారం ప్రొద్దుటూరు, హనుమనగుత్తి, జమ్మలమడుగు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన అనుమానితులను పిలిపించి విచారణ చేశారు. మధ్యాహ్నం పోలీసు అధికారులు గండికోట నేరస్థలం, గండికోట కొట్టాలపల్లె వైపు అన్ని ప్రాంతాల్లో రహస్యంగా వెళ్లి పరిశీలించినట్లుగా తెలుస్తోంది. జమ్మలమడుగు పట్టణంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఈ హత్య సంచలనంగా మారింది. ఈ క్రమంలో పోలీసులు నిందితులను ఎప్పుడు అదుపులోకి తీసుకుంటా రోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

కూటమిలో వైసీపీకి పదవులు

- నాగిరెడ్డిపల్లె సొసైటీలో డైరెక్టర్‌గా నియామకం
- జగన్ పాలనలో వలంటీరుగా విధులు
- ఎన్నికల్లో వైసీపీ తరపున ప్రచారం
- ముక్కున వేలేసుకుంటున్న టీడీపీ నేతలు

కడప, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం టీడీపీ నేతలను, కార్యకర్తలను దారుణంగా అణచివేసింది. ఓ స్థాయి టీడీపీ నాయకులు సైతం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలంటేనే భయపడేలా భయభ్రాంతులకు గురిచేసింది. అయినా టీడీపీ కార్యకర్తలు ప్రాణాలను పణంగా పెట్టి ఎత్తిన పసుపు జెండాను దించకుండా వైసీపీ నిరంకుశ పాలనను తుదముట్టించి టీడీపీ సారథ్యంలో కూటమి పార్టీని అధికారంలోకి తెచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిందే కానీ కష్టపడిన కార్యకర్తకు ప్రతిఫలం నేతిబీరకాయ చందంలా మారిపోయిందంటున్నారు. మొన్నటివరకు అటు వైసీపీలో చక్రం తిప్పిన వారే మళ్లీ ఇటువైపు టీడీపీలోకి వచ్చి ఏదో రకంగా పదవులను అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ సహకార శాఖ, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు (పీఏసీఎస్) నామినేటెడ్ పద్ధతిన త్రిసభ్య కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు కడప జిల్లాలో ఒకటి, రెండవ విడతలలో 13 సంఘాలకు ఒక్కో సంఘానికి ముగ్గురు చొప్పున (ఛైర్మన్, ఇద్దరు డైరక్టర్లు) 36 మందికి పదవులు దక్కాయి. వీటిలో వైసీపీ నేతలకు చోటుదక్కడంతో టీడీపీ నాయకులు ముక్కున వేలేసుకుంటున్నారు. వై.గురుప్రసాద్ ఈ నెల 21న నాగిరెడ్డిపల్లె సహకార సంఘం డైరక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన 2024కు ముందు వరకు వైసీపీ కార్యకర్తగా పనిచేశారు. ఆ ప్రభుత్వంలో వలంటీర్‌గా కూడా ఉన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైసీపీ ప్రచారాల్లో చురుగ్గా పాల్గొన్నట్లు వైసీపీ నేతలే చెప్పుకొస్తున్నారు. తరువాత టీడీపీ అధికారంలోకి వచ్చింది. అయితే పార్టీలోని కొందరు మండల స్థాయి నాయకులు ప్యాకేజీలకు, బంధుప్రీతి, కుల ప్రీతికి కట్టుబడి వైసీపీలోని కార్యకర్తలను, నాయకులను చేరదీస్తున్నారు.



నాగిరెడ్డిపల్లె సొసైటీ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి

ఈ క్రమంలోనే వై.గురుప్రసాద్‌ను కూడా టీడీపీ నాయకుడిగా చెప్పుకొచ్చారు. టీడీపీ సభ్యత్వాన్ని ఇప్పించారు. స్థానిక టీడీపీ నాయకుల ప్రమేయం లేకుండానే పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీ జాబితాలో ఆయన పేరును పొందుపరిచి ఎమ్మెలే కార్యాలయానికి పంపారు. మండల కమిటీపై ఉన్న నమ్మకంతో సదరు జాబితాలో ఎవరు..? ఏమిటి..? పరిశీలించకుండా జాబితాలోని వారిని సిఫార్సు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన జాబితాలో డైరెక్టర్‌గా గురుప్రసాద్ పేరు వెలువడింది. ఈ మేరకు తన ప్రమాణస్వీకారానికి రావాలని గురుప్రసాద్ తనతో సన్నిహితంగా ఉన్న కొందరు వైసీపీ నాయకులను ఆహ్వానించినట్లు వినికిడి. ఈ మేరకు వైసీపీ నేతలు సదరు విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా వెళ్లొద్దని ఆజ్ఞాపించినట్లు సమాచారం.

వాకబు చేసిన ఎమ్మెల్యే

ప్రమాణస్వీకారోత్సవానికి ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై వారిని అభినందించారు. కార్యక్రమ అనంతరం ఎందుకో ఏమో గురుప్రసాద్‌ను ఎమ్మెల్యే వాకబు చేసినట్లు వినికిడి. ఇతన్ని పార్టీ కార్యక్రమాల్లో ఎప్పుడూ చూడలేదే అని కొందరు నాయకులను ఆరా తీసినట్లు తెలిసింది. ఇందుకు సదరు నాయకులు మనవాడే అన్న.. అంటూ కితాబిచ్చి ఎమ్మెల్యేను ఏమార్చినట్లు చెప్పుకొస్తున్నారు.

మదనపడుతున్న టీడీపీ కార్యకర్తలు

పార్టీకి వెన్నంటి కష్టపడిన కార్యకర్తలను కాదని మొన్నటివరకు వైసీపీలో పనిచేసి, వలంటీర్‌గా టీడీపీ సానుభూతిపరులను ఇబ్బంది పెట్టిన గురుప్రసాద్‌కు డైరెక్టర్ పదవి ఇవ్వడం పట్ల టీడీపీ కార్యకర్తలు మదనపడుతున్నారు. సొసైటీకి పేర్లు ఎంపిక చేసేటప్పుడు కనీసం స్థానిక నాయకులకు కూడా తెలియకుండా చేశారని ఆవేదన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా టీడీపీ జెండాను వదలకుండా పెద్దాయన కోసం పనిచేశామని, కానీ వైసీపీ వారికి పదవులు ఇవ్వడం బాదేస్తుందని రోదిస్తున్నారు. ఇప్పటికైనా పార్టీకి పనిచేసిన వారిని గుర్తించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

చెత్త సంపద కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాజంపేటటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని హస్తవరం గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి ఎంత చెత్త సేకరిస్తున్నారు. ఆ చెత్తను కేంద్రానికి తీసుకువచ్చి వేరు చేస్తున్నారా లేదా అని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. రాజంపేట మండలంలో హస్తవరం గ్రామ పంచాయతీకి ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా నిర్వహించిన సర్వేలో 40 శాతం మాత్రమే పాజిటివ్ వచ్చిందన్నారు. వెనుకబడి ఉండడానికి గల కారణాలు తెలుసుకుని వాటిని సరిదిద్ది వంద శాతానికి చేరుకోవాలన్నారు. అనంతరం హస్తవరం ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ఎలా అమలవుతుంది, ప్రతిరోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారా, రుచికరంగా ఉందా అనే విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం అందించాలని, వంట ఏజెన్సీ వారికి, ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, రాజంపేట తహసీల్దారు పీర్‌మున్నీ, పంచాయతీ విస్తరణాధికారి రామ్మూర్తి, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి అభినందనలు

పుల్లంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో పురోగతి సాధించి వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని పురోగతిలో పెట్టిన తిప్పాయపల్లె పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌ను కలెక్టర్ చామకూరి శ్రీధర్ అభినందించారు. తిప్పాయపల్లె ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త సేకరణ కేంద్రాన్ని) కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త సేకరణ కేంద్రం వినియోగం గ్రీన్ అంబాసిడర్ల నిర్వహణపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రీన్ అంబాసిడర్లతో సమస్యలు తెలుసుకున్నారు. గతంలో కంటే మెరుగైన జీతాలు సకాలంలో అందుతున్నాయని కలెక్టర్‌కు గ్రీన్ అంబాసిడర్లు తెలిపారు. గతనెల 5న తిప్పాయపల్లెలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం సందర్శించినప్పటికి, నేటికి ఎంతో మార్పు కనిపించడంతో తక్కువ సమయంలో అతి తక్కువ మంది గ్రీన్ అంబాసిడర్లను వినియోగించుకుని పురోగతి సాధించడంపై పంచాయతి కార్యదర్శి గంగాధర్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పుల్లారెడ్డి, ఎంపీడీవో జయశ్రీ, ఈవోపీఆర్డీ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిలువు దోపిడీ

- కనీస విద్యార్హత లేకుండానే రోగులకు వైద్యం
- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న అమృత్ తేజ

పీలేరురూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ ఆరోపించారు. బుధవారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ మంత్రితో పాటు వైద్యశాఖ అధికారులు ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కనీస విద్యార్హత లేని వారిచే రోగులకు వైద్యం చేయిస్తూ ప్రణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ అస్పత్రుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నామమాత్రంగా తనిఖీ చేపడుతున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందస్తుగా ఎటువంటి పరీక్షలు నిర్వహించకుండా ధనార్జనే ధ్యేయంగా ఆపరేషన్లు చేసి రోగుల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. రోజురోజుకూ ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలు సృతి మించిపోతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం వికటించి ప్రాణాలు పోతే డబ్బు ఎరచూపి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించేకన్నా వ్యాపార దృక్పథంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ప్రైవేట్ మెడికల్ మాఫియాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో విద్యార్థి సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

దువ్వూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం క్రీస్తురాజపురం వద్ద టిప్పర్ ఢీకొని గాయపడ్డ మద్దూరు హుస్సేనయ్య (63) అనే వ్యక్తి బుధవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ప్రమాద సంఘటన ఈ నెల 12న జరిగింది. రాజుపాళెం మండలం వెలువలి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై మైదుకూరు సంతకు మేకపిల్లను తీసుకుని వెళుతుండగా ప్రమాదం జరిగింది. అదే రోజు ఒకరు మృతిచెందారు. గాయపడ్డ హుస్సేనయ్య కడప అటు నుంచి తిరుపతికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీరామ ఎత్తిపోతల పథకానికి..

పూర్వ వైభవం వచ్చేనా ..?

- టీటీడీ స్వాధీనం ఎప్పుడో ?
- రైతుల ఆశలు చిగురించేనా !



నీరులేక ఎండిపోయిన ఒంటిమిట్ట చెరువు

ఒంటిమిట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని అతి పెద్ద చెరువుల్లో ఒంటిమిట్ట చెరువు ఒకటి. ఈ చెరువు నిండితే మండలంలోని అన్ని గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయి. చెరువు నిండాలని మండల రైతులు మొక్కని దేవుడు అంటూ ఉండరు. ఒక్కసారి చెరువు నిండితే మూడు సంవత్సరాలు రైతులు సంతోషంగా పంటలు పండిస్తారు. వర్షం పడితేగాని ఒంటిమిట్ట చెరువుకు నీరు రాదు. వర్షాలు పడక చెరువుకు నీరు రాకపోవడంతో మండల రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. తాగునీరుకు కూడా ప్రజలు అవస్థలు పడేవారు అలాంటిది 2014లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రం విడిపోయి భద్రాచలం తెలంగాణలో ఉండిపోవడంతో, ఒంటిమిట్ట కోదండరాముని ఆలయానికి రాష్ట్ర గుర్తింపు ఇచ్చి ఉత్సవాలను ప్రభుత్వం తరపున నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. అలాగే ఒంటిమిట్ట చెరువుకు సోమశిల బ్యాక్‌వాటర్ నుంచి సాగునీరు అందించాలని సీఎం రూ.32 కోట్లను విడుదల చేశారు. ఈ పనులకు సంబంధించి 2015లో చంద్రబాబు శంకుస్థాపనలు కూడా చేశారు. సంవత్సరం తిరగకముందే ఒంటిమిట్ట చెరువుకు సోమశిల బ్యాక్ వాటర్ శ్రీరామ ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు చేరాయి. దీంతో మండల ప్రజల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. 2019 తరువాత ఈ స్కీంకు మెయింటినెన్స్ నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో నీరు అందక చెరువు ఎండిపోయింది. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో ఒక్కరూపాయి కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో తిరిగి మండలంలో కరవుఛాయలు అలుముకున్నాయి. దీంతో రైతులు పంటలు సాగులేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

2024లో తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించడంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు పాలనలో ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేసి చెరువుకు సాగునీరు అందిస్తారని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలుసార్లు శ్రీరామ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి సాగునీరును నింపేందుకు ప్రయత్నించగా పైపులు పగిలిపోవడంతో పలుసార్లు అంతరాయం ఏర్పడింది. దీంతో ఇరిగేషన్ అధికారులు పరిశీలించి పాత పైపులైను పూర్తిగా దెబ్బతిన్నదని, కొత్త పైపులైను వేయాలని ప్రభుత్వానికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన కోదండరాముని కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబు విచ్చేశారు. కల్యాణం అనంతరం టీటీడీ చైర్మన్ జిల్లా కలెక్టర్, టీటీడీ ఈవో, అదనపు జేఈవోలతో కోదండరామాలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి పలు సూచనలు ఇచ్చారు. అలాగే శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని టీటీడీ స్వాధీనం చేసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. టీటీడీ అధికారులు చెరువు అంతర్గత విస్తీర్ణం ఆయకట్టు ప్లాను, ఎత్తిపోతల పథకం పనితీరు, మోటార్లు, పైపులైను సమాచారాన్ని సేకరించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు చెరువు అంతర్గత విస్తీర్ణం మాత్రమే సేకరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించి నెలలు గడుస్తున్నా టీటీడీ అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని స్వాధీనం చేసుకుని కొత్త పైపులైను అమర్చి చెరువుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సాగునీరు అందించే పైపులైను

చెరువుకు సాగునీరు అందించాలి



జిల్లాలోనే అతిపెద్ద చెరువు అయిన ఒంటిమిట్ట చెరువుకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి. గత రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయి. అధికారులు స్పందించి చెరువుకు సాగునీరు అందించాలి.

\- వెంకటసుబ్బారెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు, ఒంటిమిట

టీటీడీ స్వాధీనం చేసుకోవాలి



టీటీడీ వారు ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని స్వాధీనం చేసుకోవాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకొని మరమ్మతు పనులు చేసి చెరువుకు త్వరగా సాగునీరు అందించాలి.

\- మాడ రామాంజనేయులు, రైతు, ఒంటిమిట్ట

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన పొందాలి

- ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి



బాలల హక్కులు, చట్టాలపై మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి

మదనపల్లెటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అవగాహన కలిగి వుండాలని ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఎంఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఎస్ఐలు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ నేటి సమాజంలో అనాథ పిల్లలు, దివ్యాంగులైన పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని వారి కుటుంబ పెద్దలు భిక్షాటనలో దింపుతున్నారన్నారు. మరి కొందరు బాలికలను బాల్యవివాహాలు చేసి వారి భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారన్నారు. వీటన్నింటినీ నిషేధించేందుకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయన్నారు. అందులో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం అములులో వున్నాయన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో చదువుకున్న వారికి ఈ చట్టాలపై అవగాహన వస్తోందని, బాల, బాలికలు ఉన్నత చదువులు చదుకోవడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని అందులో పంచాయతీ కార్యదర్శి అధ్యక్షులుగా వుండాలన్నారు. ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారం సమావేశాలు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఈ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతగా వ్యహరించాలన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, మదనపల్లె, ఐసీడీఎస్ సీడీపీఓలు సుజాత, భాగ్యమ్మ, పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, సూపర్‌వైజర్లు శ్వేత, రమాదేవి, మహిళా ఎస్ఐలు, ఎంఈవోలు, పాల్గొన్నారు.

షోలాపూర్ - తిరుపతి ప్రత్యేక రైలు ధర్మవరం వరకు పొడిగింపు

కడపఎర్రముక్కపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): షోలాపూర్-తిరుపతిల (01437/01438) మధ్య కడప మీదుగా వెళ్లే ప్రత్యేక రైలును ధర్మవరం వరకు రెండు నెలల పటు పొడిగించినట్లు కడపరైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈనెల 24 నుంచి సెప్టెంబర్ 27వ తేదీ వరకు రాను 10 ట్రిప్పులు, పోను 10 ట్రిప్పులు నడుస్తుందన్నారు. షోలాపూర్ నుంచి తిరుపతి (01437 రైలు) ప్రతి బుధవారం రాత్రి 11:20 గంటలకు షోలాపూర్‌లో రైలు బయలుదేరి రాయచూర్, మంత్రాలయం, గుంతకల్ మీదుగా ఎర్రగుంట్లకు శుక్రవారం రాత్రి 7:18 గంటలకు, కడపకు 7:53గంటలకు చేరుకోనుందన్నారు. ధర్మవరానికి శనివారం ఉదయం 3:30గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో ప్రతి శనివారం ఉదయం 5:30గంటలకు ధర్మవరంలో బయలుదేరి రేణిగుంట మీదుగా తిరుపతికి 11:00 గంటలకు, రాజంపేటకు మధ్యాహ్నం 12:28కి, కడపకు 1:28కి, ఎర్రగుంట్లకు 2.09కి చేరుకుంటుందన్నారు. తాడిపత్రి, గుంతకల్ మీదుగా ఆదివారం ఉదయ 10:4కి షోలాపూర్‌కు చేరుకుంటుందన్నారు.

భూమి చదునును అడ్డుకున్న అధికారులు



భూమిని చదును చేస్తుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): అక్రమంగా భూమిని చదును చేస్తుండగా బుధవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మదనపల్లె మండలం, కొండామరిపల్లె పంచాయతీలో కొందరు అక్రమంగా ఎక్స్‌కవేట ర్‌తో భూమిని చదును చేస్తున్నట్లు తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందడంతో తహసీల్దార్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు అక్కడికి రెవెన్యూ సిబ్బంది చేరుకుని అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిని చదును చేయడం నేరమని, ప్రభుత్వ భూమిని అక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నైపుణ్యాలను వెలికి తీయడమే ఉపాధ్యాయుల కర్తవ్యం

\- డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు




ఇంగ్లీష్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు

రాయచోటిటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలను వెలికి తీయడమే ఉపాధ్యాయుల కర్తవ్యమని డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని డైట్‌లో ఇంగ్లీష్ క్లబ్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం విద్యార్థుల భాషా నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు, ఇంగ్లీష్ సాహిత్యం, కమ్యూనికేషన్, సాంస్కృతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు ఒక ముఖ్యమైన వేదికగా నిలవనుందని డైట్ ఇంగ్లీష్ లెక్చరర్ తిరుపతి శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు ఇంగ్లీష్ భాషా ప్రాముఖ్యతను వివరించారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనికేషన్ కోసం అత్యంత అవసరమైన భాష అని పేర్కొంటూ విద్యార్థులు ఈ క్లబ్ ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ విద్యావేత్త, సాంస్కృతిక విద్య జిల్లా సమన్వయకర్త కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఇంగ్లీష్ క్లబ్ ద్వారా విద్యార్థులకు డిబేట్లు, చర్చలు, కవితా పఠనలు, ప్రదర్శనలు, వర్క్‌షాపులు వంటి కార్యక్రమాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ లెక్చరర్స్ వెంకటసుబ్బారెడ్డి, శివభాస్కర్, వైసీ రెడ్డెప్పరెడ్డి, మోహన్‌నాయక్, శివప్రసాద్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆవులకు చర్మవ్యాధి నిరోధక టీకాలు

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై



ఆవులను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

నందలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి ఇసుకపల్లె గ్రామంలో ఆవులకు ముద్దచర్మ వ్యాధి నిరోధక టీకాలను వేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూలై 11 నుంచి 31వ తేది వరకు జరిగే లంపిస్కిన్ (ఆవుల్లో ముద్ద చర్మ)వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆవులకు ముద్ద చర్మ వ్యాధి వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడి రైతులకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందలూరు పశువైద్యులు డాక్టర్ పి.ఈశ్వర్‌ప్రసాద్, డాక్టర్ వై.మాధవిలత, వీఏడీ సుదర్శన్‌రెడ్డి, ఏహెచ్ఏలు బి.జాహ్నవి, వై.శిరీషా, బి.శివరాం, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

రాయచోటిటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని అనారోగ్య బాధితుల ఆసుపత్రి ఖర్చులకు గానూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. బుధవారం నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి మంత్రి మండిపల్లి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 20 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.25.30 లక్షల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

మట్టి మాఫియా ఇష్టారాజ్యం

- వితలం, వడ్డిపల్లె చెరువుల్లో అక్రమ తవ్వకాలు
- బొరియలుగా మారిపోయిన చెరువులు.. అధికారుల చోద్యం

వాల్మీకిపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్లతో మట్టిని తోడేస్తూ అక్రమంగా తరలిస్తూ వితలం, వడ్డిపల్లె చెరువులను ఎక్స్‌కవేటర్లతో తోడేస్తున్నారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శలున్నాయి. చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలించుకు పోతుండడంతో ఎటుచూసినా అగాధాలు, బొరియలుగా మారి చెరువు ప్రాంతం రూపు రేఖలు కోల్పోతోంది.

వాల్మీకిపురం మండలంలోని వితలం గ్రామ సమీప చెరువులో మట్టి మాఫియా ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగిస్తున్నారు. కొద్ది నెలలుగా చెరువు ప్రాంతంలో ఎక్స్‌కవేటర్లు పెట్టి మట్టిని అక్రమంగా తవ్వేస్తూ రియల్‌ఎస్టేట్ భూములకు తదితర వాటికి ట్రాక్టర్ల ద్వారా తరలించుకుపోతుండడం గమనార్హం. జాతీయ రహదారికి పక్కగానే ఉన్న చెరువు ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మట్టిని అక్రమంగా తరలించుకుపోతుండడంతో చెరువు రూపురేఖలు కోల్పోతోంది. ఇప్పటికైనా అక్రమ మట్టి తవ్వకాలపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. మండలంలోని జర్రావారిపల్లె గ్రామ పంచాయతీ చీమలబండ వడ్డిపల్లె ప్రాంతంలోని చెరువులో మట్టి మాఫియా ఆగడా లకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రీ పగలు ఎక్స్‌కవేటర్లతో మట్టిని తోడేస్తూ రియల్‌ఎస్టేట్ వెంచర్లు తదితర వాటికి అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఈ ప్రాంతంలో చెరువులకు నీరు వచ్చే మార్గం లేక 20ఏళ్లుగా గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇసుక మాఫియా దౌర్జన్యాలతో మట్టి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ పామిలేటిని వివరణ కోరగా మండలంలోని చెరువు ప్రాంతంలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక ముందు నిఘా పెట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడే వాహనాలు సీజ్ చేస్తూ తగు చర్యలు తీసుకుంటామన్నారు.



మట్టి తవ్వకాలతో అగాదాలుగా మారిపోయిన వడ్డిపల్లె చెరువు



వితలం చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టితవ్వకాలు



చీమలబండ వడ్డిపల్లె చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వకాలు

అటకెక్కిన శిక్షణ

- నిరుపయోగంగా మారిన శిక్షణ కేంద్రం
- శిథిలమవుతున్న భవనం
- వృథా అవుతున్న ప్రజాధనం

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం నిరుపయోగంగా మారుతోంది. కడప నగర శివారు ప్రాంతంలో 2008 నవంబరు 1న అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గల్లా అరుణకుమారి క్లస్టరు స్థాయి జీవనోపాధుల వనరుల కేంద్రం ప్రారంభించారు. అప్పటి నుంచి డ్వామా పరిధిలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించేవారు. రాత్రిపూట శిక్షణార్థులు బస చేసేందుకు వీలుగా డార్మిటరీలను ఏర్పాటు చేశారు. కానీ గత కొంత కాలంగా ఇక్కడ శిక్షణలను ఇవ్వకపోవడంతో భవనం నిరుపయోగంగా మారుతోంది. చాలా వరకు శిక్షణ కార్యక్రమాలను కొత్త కలెక్టరేట్‌లోని డి.బ్లాక్ లోనే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో డీఎల్ఆర్‌సీ భవనం పూర్తిగా నిరుపయోగంగా మారింది. దీంతో భవ నంలోని పలు గదుల్లో సామగ్రి శిథిలావస్థకు చేరుకుంటోంది. గదులకు ఏర్పాటు చేసిన తలుపులు పాడైపోయాయి. విద్యుత్ సౌక ర్యం కూడా సరిగా లేకపోవడంతో చీకటి అలుముకుంది. కిటికీలు ధ్వంసమవుతున్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేపడితే ఈ భవ నం అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. కానీ పూర్తిగా వదిలి వేయడంతో భవనం శిథిలమయ్యే పరిస్థితి కనిపిస్తుంది.



ఊడిన తలుపులు



డీఎల్ఆర్‌సీ భవనం



నిరుపయోగంగా ఉన్న శిక్షణ గది

సిబ్బంది హాజరు నామమాత్రం

డీఎల్ఆర్‌సీ భవనంలో ఎలాంటి శిక్షణలు ఇవ్వకపోయినప్పటికీ అక్కడ సిబ్బందికి ఏ పని చేయకున్నా వేతనాలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేంద్రంలో నలుగురు ట్యూటర్లతో పాటు ఒక కంప్యూటరు ఆపరేటరు, పగటిపూట అటెండరు, రాత్రివేళల్లో వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేశారు. అయితే వీరిలో పగలు అటెండరు, రాత్రివేళల్లో వాచ్‌మెన్ మాత్రమే కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రతినెలా వేలాది రూపాయలు వారికి వేతనాలుగా చెల్లిస్తున్నారు. ఇటీవల డీఎల్ఆర్‌సీ భవనాన్ని ఆంధ్రజ్యోతి సందర్శించగా అక్కడ అటెండరు ఒక్కరే ఉన్నారు. మిగతా సిబ్బంది గురించి ఆరా తీస్తే వారందరూ భోజనానికి వెళ్లినట్లు అటెండరు సమాధానం ఇవ్వడం గమనార్హం. ఈ విషయం డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తాను పరిశీలించి చర్యలు తీసుకుంటానని సమాధానం ఇచ్చారు.

ఆర్డీఓ టేబుల్‌పైకి యూసీఐఎల్ బాధితుల ఫైల్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పులివెందుల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్ బాధితుల ఫైలు ఎట్టకేలకు ఆర్డీఓ చిన్నయ్య టేబుల్‌పైకి చేరింది. బుధవారం 'ఎన్నేళ్లీ... ఎదు రుచూపులు' ఆర్డీఓ కార్యాలయంలో ఫైలు మాయం అనే శీర్షికతో ఆంధ్ర జ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఆర్డీఓ చిన్నయ్య కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 10.30గంటలకు నేను కార్యా లయానికి వచ్చేసరికి ఫైల్ నా టేబుల్‌పై ఉండాలని కిందిస్థాయి అధికా రులకు చెప్పినట్లు తెలిసింది. దీంతో కార్యాలయాలో పనిచేసే అధికారులు ఉదయం నుంచే ఫైలు వెతకడం ప్రారంభించారు. అన్ని సెక్షన్లలోను, ర్యాకుల్లో ఫైళ్లన్నీ పరిశీలించగా.. ఫైల్ కంటపడడంతో అధికారులు ఊపిరిపీల్చు కున్నారు. ఆర్డీఓ కార్యాలయానికి వచ్చేసరికి ఆయన టేబుల్ పైకి ఫైల్ చేరింది. దీంతో కార్యాలయానికి వచ్చే ఫైళ్లను జాగ్రత్తగా భద్రపరచాలని ఆర్డీఓ సిబ్బందికి చెప్పినట్లు తెలిసింది. 11గంటల ప్రాంతంలో ఫైల్‌కు సంబంధించిన బాధితులు భాస్కర్, రవిశంకర్‌లు కార్యాలయానికి వెళ్లగా.. అక్కడున్న సిబ్బంది మీఫైల్ కనిపించిందని అది ఆర్డీఓ టేబుల్‌పైన ఉందని సమాచారం ఇచ్చారు. అదే సమయంలో ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లిన ఆంధ్రజ్యోతికి వారు ఫైల్ విషయాన్ని వివరించారు. మా ఫైల్ కనిపిం చకపోయేటప్పటికి 14ఏళ్లుగా ఎదురు చూసిన ఉపయోగం లేకుండా పోయిం దని ఎంతో బాధపడ్డామని వారు వివరించారు. ఆంధ్రజ్యోతి పుణ్యమా అని వారు మా ఫైల్ కనిపించిందని, కృతజ్ఞతలు తెలిపారు. యూసీఐఎల్ స్పం దించి మాకు ఇవ్వాల్సిన ఉద్యోగాన్ని మాకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి రైల్వే స్టేషను సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. మృతుడి వయసు 22 నుంచి 26 సంవత్సరాల మధ్యలో ఉంటుందని.. మృతుడి జేబులో చెన్నై టు కడప టికెట్ గుర్తించారు. అయితే చెన్నై నుంచి కడపలో దిగలేక తాడిపత్రిలో దిగి ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయంపై అక్కడ రైల్వేపోలీసులు ఆరా తీస్తున్నారు. మృతి చెందిన యువకుడి ఇతర వివరాల కోసం తాడిపత్రి పోలీసులను సంప్రదించాలని తాడిపత్రి రైల్వే కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజంపేట రోడ్డులోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద బుధవారం తెల్లవారు జామున 3గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తి వయసు 35 నుంచి 40 మధ్య ఉంటుందని.. తెల్లవారు జామున రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. మృతుడి వివరాల కోసం సెల్ 9121100539, 9121100540 నెంబర్లకు ఫోను చేయాలని తెలిపారు.

అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి రిమ్స్‌కు...

కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ గ్యారేజీ సమీపంలో అపస్మారకస్థితిలో పడిపోయి ఉన్న కోట భక్తవత్సలంనాయుడు అనే వ్యక్తిని ఆర్టీసీ ఏఎస్ఐ శ్రీరాములునాయక్, రిటైర్డ్ ఆర్టీసీ కండక్టరు వెంకటసురేశ్‌బాబులు గుర్తించారు. 108కు సమాచారం అందించడంతో అతన్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అయితే అతడికి ఫిట్స్ వచ్చి పడిపోయాడా, లేక అనారోగ్యంతో సొమ్మసిల్లి పడిపోయాడా అనేది తెలియాల్సి ఉంది. అతని వద్ద ఉన్న ఫోను ద్వారా వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

జరిమానాలు చెల్లించని కారు సీజ్

కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఓ కారు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో పలు దఫాలుగా చలానాలు వేశారు. బుధవారం ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టగా ఇదే కారు పట్టుబడింది. దీంతో కారుకు సంబంధించి 18 ఈచలానాలు పెండింగులో ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. అయితే కారు యజమాని పెండింగు చలానాలకు సంబంధించి రూ.10,515 చెల్లించడంతో కారును అతనికి అప్పగించారు. వాహ నదారులు పెండింగులో ఉన్న ఈ చలానాలను సక్రమంగా చెల్లించకపోతే సీజ్ చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

వివాహిత ఆత్మహత్య



మైలవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపరాల గ్రామానికి చెందిన కుండా లక్ష్మీదేవి (38) అనే వివాహిత క్షణికావేశంలో బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి వివరాల మేరకు... ఇంటిలో చిన్న చిన్న సమస్యల విషయమై కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కలత చెందిన లక్ష్మీదేవి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త శ్రీనివాసులు ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

పులివెందుల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలని తన భర్త, అత్త వేధిస్తున్నారని బుధవారం పులివెందులకు చెందిన ఓ మహిళ (తను పేరును బయటకు వెల్లడించవద్దని పోలీసులకు విన్నవించిన) పులివెందుల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల మేరకు.. తాడిపత్రికి చెందిన నవాజ్‌షరీఫ్ అనే వ్యక్తితో తనకు వివాహం చేసి తల్లిదండ్రులు పంపించారన్నారు. కానీ కొంతకాలంగా భర్త నవాజ్ షరీఫ్, అత్త రహమత్‌బీలు వేధిస్తున్నారని... వారి వేధింపులు తాళలేక పుట్టింటికి వచ్చానని పేర్కొన్నారు. ఈమేరకు ఆమె పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు.

మహిళ అదృశ్యం



కలసపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బి (30) అదృశ్యమైనట్లు భర్త షేక్ హుస్సేన్‌వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎల్.తిమోతి తెలిపారు. వివరాల్లోకెళితే... ఈనెల 21వ తేదీ ఇంటివద్ద నుంచి వెళ్లిపోయిందని, ఎక్కడికి వెళ్లిందో అని బంధువులు ఇళ్లలో వెతికి చూడగా కనిపించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే కలసపాడు పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని తెలిపారు. 9121100632 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రైతులను మోసగిస్తే క్రిమినల్ కేసులు

- జిల్లాలో ఎరువుల కొరత లేదు
- జేడీఏ చంద్రానాయక్



ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న జేడీఏ చంద్రానాయక్, వ్యవసాయాధికారులు

ప్రొద్దుటూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ ఎరువుల కొరతను సృష్టించి రైతులను ఇబ్బంది పెట్టినా, అధిక ధరలకు అమ్మకాలు జరిపినా క్రిమినల్ కేసులు నమోదు చేసి దుకాణాలు సీజ్ చేస్తామని వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు బి.చంద్రానాయక్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని మహాలక్ష్మి ఫర్టిలైజర్స్‌లో స్టాకు వివరాలను పరిశీలించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ అవసరాలకు తగ్గట్లు జిల్లాకు 70 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాలు, రీటైల్, హోల్‌సేల్ దుకాణాల్లో అన్నింటిలో కలిపి 25 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కొంతమంది కృత్రిమ ఎరువుల కొరతను సృష్టించి రైతుల్లో ఆందోళన కలిగించి అధిక మోతాదుల్లో స్టాకును కొనుగోలు చేసేలా ప్రోత్సహించడం తప్పుదారి పట్టించడమేనని అన్నారు. రైతులు కొనుగోలు చేసిన అన్నింటికి దుకాణ యజమానులు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని ఆదేశించారు. బిల్లులు ఇవ్వకపోయినా, అధిక ధరలకు ఎరువులు అమ్మినా రైతులు నేరుగా ఆ దుకాణాల నుంచే స్థానిక వ్యవసాయాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేస్తే 15 నిమిషాల్లో అక్కడికి చేరుకుని వారిపై చర్యలు తీసుకునేలా యాక్షన్‌ప్లాన్ చేపడుతున్నామన్నారు. రైతన్నలకు వ్యవసాయ శాఖ అండగా ఉంటుందని, ప్రతి రైతు అవసరాలను రైతు సేవా కేంద్రాల ద్వారా పూర్తి చేస్తామన్నారు. పంట కాలపరిమితి పూర్తయ్యేవరకు ఎరువులు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు డివిజన్ ఏడీఏ అనిత, కడప డీఆర్‌సీ కేంద్ర ఏడీఏ అశోక్‌రెడ్డి, ఏవో వరాహరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

తొండూరు ఎస్ఐపై జమ్మలమడుగు జడ్జికి ఫిర్యాదు

- రీమెడికల్ ఎగ్జామ్‌కు ఆదేశించిన కోర్టు

పులివెందుల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని ఇనగలూరు హత్యాయత్నం కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని బుధవారం సాయం త్రం జమ్మలమడుగు కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. ఈసందర్భంగా తొండూరు ఎస్ఐ తమను కొట్టినట్లు జమ్మలమడుగు కోర్టు జడ్జికి ఐదుగురు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే... తొండూరు మండలంలోని ఇనగలూరు గ్రామా నికి చెందిన ఓ వర్గం మరో వర్గంవారిపై కారుతో ఢీకొట్టి కత్తు లతో, రాడ్లతో దాడి చేశారు. ఇందుకు సంబంధించి తొండూరు పోలీస్‌స్టేషన్‌లో 11 మందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో ఉన్న ప్రశాంత్ రెడ్డి, ఓబుళ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గంగిరెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి బుధ వారం సాయంత్రం జమ్మలమ డుగు కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా వారు తొండూరు ఎస్ఐ ఘనమద్దిలేటి తమపై థర్డ్‌డిగ్రీ ప్రయోగిం చారని, విచక్షణరహితంగా కొట్టారని జడ్జికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జడ్జి రీమెడికల్ చెకప్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఎస్ఐని వివరణ కోరగా.. జమ్మల మడుగు మెజిస్ట్రేట్ రీమెడికల్ చెకప్‌కు ఆదే శాలు జారీ చేశార న్నారు. అది ఎపుడు, ఎక్కడ అనేది ఇంకా వివరాలు వెల్లడించ లేదని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఆప్కో డిస్కౌంట్ కార్డుల పంపిణీ

కడప మారుతీనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆప్కో చేనేత వస్త్రాల అమ్మకాలపై జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు డిస్కౌంట్ కార్డులు పంపిణీ చేసినట్లు కడప ఆప్కో మండల వాణిజ్య అధికారి బి.గోపాలకృష్ణ తెలిపారు. ఉద్యోగులు కార్డులు ఉపయోగించి ఆప్కో విక్రయశాలలో అన్ని రకాల చేనేత వస్త్రాలపై 30 శాతం డిస్కౌంట్ పొందాలని కోరారు. కడప నగరంలోని ఆప్కో విక్రయశాలతో పాటు పులివెందుల, రాయచోటి, కోడూరు, రాజంపేట తదితర ప్రాంతాలలో గల ఆప్కో చేనేత విక్రయశాలల్లో చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నకు చేయూత అందించాలని కోరారు.

నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

కడప(వినాయకనగర్), జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు కెనరా బ్యాంకు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కడప వారి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు.

రామాంజనేయపురంలోని గర్ల్స్ ఐటీఐ కాలేజీ పక్కన ఉన్న డీటీసీ కేంద్రంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీలో గ్రామీణ మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ ఈనెల 28 నుంచి ఆగస్టు 27 వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9440905478, 9985606866 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రామిరెడ్డిపల్లెలో అరుదైన పుట్టగొడుగు



వేంపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో అరుదైన పుట్టగొడుగు లభించింది. బుధవారం రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రైతు బోరెడ్డి నరసింహారెడ్డి పొలంలో ప్రకృతి సిద్ధంగా మొలిచిన పుట్టగొడుగు దాదాపు 1.76 కిలోల బరువు ఉండడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు వింతగా చూసేందుకు వచ్చారు.

మల్టీడే మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో చిత్తూరు, కడప జట్ల విజయం



అక్తర్ (చిత్తూరు)

కడప స్పోర్ట్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో తమ ప్రత్యర్థి జట్లపై చిత్తూరు, కడప జట్లు విజయం సాధించాయి. వివరాలిలా.........

కడప నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 21వ తేదీ నుంచి అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 38.2 ఓవర్లలో 128 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా చిత్తూరు జట్టు 50.5 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో చిత్తూరు జట్టుకు 56 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 66.3 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో 196 పరుగుల విజయలక్ష్యంతో దిగిన చిత్తూరు జట్టు మూడవ రోజైన బుధవారం 74.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో అక్తర్ 105 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో చిత్తూరు జట్టు 2 వికెట్ల తేడాతో గెలుపొందింది.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో తొలుత నెల్లూ రు జట్టు బ్యాటింగ్‌కు దిగి 29.3 ఓవర్లలోనే కేవలం 78 పరుగులకే అన్ని వికెట్లు కోల్పోయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 38.4 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కడప జట్టుకు 62 పరుగులు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు 69.2 ఓవర్లలో 215 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో 153 పరుగుల విజయలక్ష్యంగా బరిలోకి దిగిన కడప జట్టు 66.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలుపుసాధించింది.

ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ఆశాల సమస్యలపై చర్చిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, జూలై 23, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి శాయశక్తుల కృషి చేస్తానని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర కమిషనరు ఆదేశాల మేరకు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కార వేదిక జరిగింది.

ఈ సమావేశంలో 17 మంది ఆశావర్కర్లు తమ సమస్యలను డీఎం అండ్‌హెచ్‌ఓకు విన్నవించగా 12 మంది సమస్యలు పరిష్కరించినట్లు తెలి యజేశారు. ఈసందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త ఇ-ఆశా యాప్ ప్రతి రోజు ఓపెన్ చేయాలన్నారు. ఐదుగురు ఇండి కేటర్స్‌ను అప్లోడ్ చేయాలన్నారు. కిల్కారి సేవల గురించి ప్రతి గర్భిణికి తెలి యజేసి, వాటిని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమా మహేశ్వరకుమార్, వేణు, ఆశా, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

పులివెందుల ఆర్డీఓ రూటే వేరు!

పులివెందుల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య రూటే వేరు. పులివెందుల ఆర్డీఓ డివిజన్ పరిధిలో జరుగుతున్న విషయాలేవీ తనకు తెలియవని సమాధానాలు చెప్పడం ఆయనకే చెల్లింది. బుధవారం ఆంధ్రజ్యోతి ఆర్డీఓ చిన్నయ్యను కలిసింది. పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో భూపంపిణీపై కూటమి ప్రభుత్వం విచారణ చేసిన విషయంపై ఆయనను ప్రశ్నించింది. పులివెందుల నియోజకవర్గంలోని తొండూరు, చక్రాయ పేట, సింహాద్రిపురం మండలాల్లో భూపంపిణీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ప్రభుత్వం విచారణకు ఆదేశించింది కదా.. ప్రస్తుతం విచారణ సాగుతోందా అని ఆంధ్రజ్యోతి ఆర్డీఓను ప్రశ్నించింది. అందుకు ఆయన స్పందిస్తూ విచారణ లాంటిది ఏం సాగడం లేదు, ఎవరు చెప్పారు అని ఎదురు ప్రశ్న వేశారు. మూడు మండలాల్లో భూపంపిణీపై విచారణ చేయమని ఆదేశాలు జారీ చేసింది కదా అని మరోమారు ఆయనకు వివరించే ప్రయత్నం చేసింది. అందుకు ఆయన ప్రభుత్వం విచారణకు ఆదేశించిందా, కలెక్టర్ విచారణకు ఆదేశించారా అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోనే ఈ ఆదేశాలు వెలువడ్డాయి కదా అని ఆంధ్రజ్యోతి ప్రశించగా.. భూపంపిణీపై విచారణకు ఆదేశించారా లేక తహసీల్దార్లపైన విచారణకు ఆదేశించారా అని మరో మారు ఆయన ప్రశ్నించారు. భూ పంపిణీపైన విచారణ చేయమని ఆదేశించింది కదా అని చెబితే అది రొటీన్‌గా జరుగుతుంటుందని తేలిగ్గా కొట్టిపారేశారు. ఇదే కాకుండా ఆర్డీఓ కార్యాలయానికి పలు పనులపైన ప్రజలు వస్తే చూద్దాం.. చేద్దాం అని సమాధానం చెప్పడం తప్ప కార్యాలయంలో ఎలాంటి పనులు సాగడం లేదని నియోజకవర్గంలోని ప్రజలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఎన్నిసార్లు తిరిగినా ఆర్డీఓ గానీ, వారి సిబ్బంది గాని పనులు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం నుంచి భూములకు సంబంధించిన ఫైల్ ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిందని.. దాన్ని పరిష్కరించాలని రైతులు ఆర్డీఓను సంప్రదిస్తే ఫైలా? ఎప్పుడొచ్చింది, ఎప్పుడు పంపించారు చూద్దాంలే, వస్తే ఉంటుందిలే.. అని సమాధామిస్తున్నారని పలువురు ప్రజలు వాపోతున్నారు. ఆర్డీఓ స్థాయి అధికారి ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మా భూములకు సంబంధించి సమస్య ఉంటే ఇక్కడకు వస్తే ఇంత నిర్లక్ష్యమా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయం ఉన్నప్పుడు పులివెందుల, జమ్మల మడుగు, ప్రొద్దుటూరు తదితర నియోజకవర్గాలు ఉండడంతో అక్కడ కొంతమేర పనిభారం ఉండేదని, పనులు కాస్త ఆలస్యంగా కూడా జరిగేవని రైతులు అంటున్నారు. ప్రస్తుతం 8 మండలాలకు ఒక రెవిన్యూ డివిజనల్ కార్యాలయం ఉన్నా ఇక్కడపనులు మాత్రం సాగడం లేదని అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు.

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం

● కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి



స్వామినగర్‌లో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి తదితరులు

సీకేదిన్నె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం, కడప కార్పొరేషన్ 18వ డివిజన్‌లోని స్వామినగర్‌లో బుధవారం రూ.1.26 కోట్లతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి మారుపేరు అనడానికి ప్రస్తుతం జరుగుతున్న పనులే నిదర్శనమన్నారు. అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించి పూర్తి స్థాయిలో సంతృప్తిని తీసుకొస్తామన్నారు. ఇప్పటికే సూపర్-6 పథకాలు అమలు చేస్తూ ప్రజలకు ఎంతో చేరువగా ఉన్నామన్నారు. వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, అన్నదాత సుఖీభవ పథకాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంద న్నారు. తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. కడప కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, నాయకులు కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, సిరాజ్‌బాషా, సుబ్బిరెడ్డి, మునీంద్ర, నరసింహులు, బాషా పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డును అబివృద్ధి చేస్తాం

కమలాపురం రూరల్ :కమలాపురం మార్కెట్‌యార్డును అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డు చైర్మన్ రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. కమలాపురం మార్కెట్‌యార్డు జిల్లాలో ప్రథమ స్థానం లోఉందని, ఈ మార్కెట్ మరింత అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం పాలక మండలి కూడా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం మార్కెట్‌యార్డులో గదులు ఖాళీగా ఉంటే వ్యాపారులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ యార్డులో ఉన్న గోదాములను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ చలపతి, నరసింహారెడ్డి, కేటీఆర్ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు శాశ్వతం కావు.. అధికారులే శాశ్వతం

● మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, జూలై 23 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వాలు శాశ్వతం కాదు.. నాయకులు వస్తారు.. పోతారు అధికారులు మాత్రం శాశ్వతమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అధికారులను నిలదీస్తామని హెచ్చరించారు. బుధవారం కడప నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్త్రీనిధి పథకం అమలుకు రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి అచ్చెన్నాయుడు అనడం విడ్డూరంగా ఉందన్నారు. సకాలంలో ఎరువులు, రుణాలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా అనే సందేహం కలుగుతోందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలయ్యేంత వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. కార్పొరేటర్లు షఫి, అజ్మతుల్లా ఖాన్, నేతలు దాసరి శివప్రసాద్, బీహెచ్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

'చలో విద్యుత్‌సౌధ'ను జయప్రదం చేయండి

కడప నాగరాజుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 7వ తేదీన తలపెట్టిన చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూఈసీ వర్కర్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి, యూఈఈ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కడప ట్రాన్స్‌కో శంకరాపురం కార్యాలయం వద్ద చలో విద్యుత్ సౌధ గోడపత్రాలు విడుదల చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కార్మికులకు కోటి రూపాయల ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తులను స్మరించుకోవడం మన కర్తవ్యం

వేంపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దేశభక్తులను స్మరించుకోవడం నేటి ప్రజల ముఖ్య కర్తవ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుళరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో స్వాతంత్ర్య సమర యోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భం గా వారికి ఘన నివాళులు అర్పించారు. తిలక్, ఆజాద్ విధానాలు వేరైనా భారత స్వాతంత్ర్యోద్యమంలో వారు పోషించిన పాత్ర అనిర్వచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే.. ఉద్యమం!

● ఎన్ఎంయూఏ అధ్యక్ష, కార్యదర్శులు జయరామ్, శ్రీనివాసులు

కడప మారుతీనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా వున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు టి. జయరామ్, ఎస్. శ్రీనివాసులు సంబంధిత డిపో అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్ఎంయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడప డిపోలో 1/2019 సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలన్నారు. అర్హులైన మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు, అత్యవసర పరిస్థితులలో ఉద్యోగులకు సెలవులు మంజూరు చేయాలన్నారు. డ్రైవర్లతో పాటుగా కండక్టర్లకు కూడా ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్ వేయాలన్నారు. కలెక్షన్స్, కేఎంపీఎల్‌పై ఉద్యోగులను వేధించే పద్ధతు లకు స్వస్తి పలకాలన్నారు. అనారోగ్యం పాలై ఆర్టీసీ గవర్నమెంట్ సిక్‌లు చేసిన ఉద్యోగులకు వారికున్న అర్హతను బట్టి కమిటేషన్ లీవులుగా పరిగణించి పూర్తి జీతం ఇవ్వాలన్నారు. పే స్లిప్పులు డౌన్‌లోడ్ చేసుకోలేని వారికి కార్యాలయం ద్వారా ఇప్పించాలన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 31 నుంచి వచ్చే ఆగస్టు 1వ తేదీన రెండు రోజుల పాటు ఉదయం తొలి సర్వీస్ నుంచి ఎర్ర బ్యాడ్జీలతో డ్యూటీలు చేస్తామన్నారు. ఆగస్టు 1న ఉదయం టీ విరామ సమయంలో గేట్‌మీటింగ్ తలపెట్టినట్లు స్పష్టం చేశారు. అంతకూ పరిష్కరించకపోతే ఉద్యమానికి సన్నద్ధం కానున్నామన్నారు.

వర్షాకాలంలో చీనీ తోటల యాజమాన్యంపై శిక్షణ

సింహాద్రిపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చీనీ తోటల్లో అధిక దిగుబడులకు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవి చంద్రబాబు తెలిపారు. మండలంలోని హిమకుంట్ల గ్రామంలో బుధవారం వర్షాకాలంలో చీనీ తోట యాజమాన్యంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. అధిక తేమ కారణంగా వేరుకుళ్లు సోకి చీనీ చెట్లు చనిపోతాయని తెలిపారు. నేల స్వభావాన్ని బట్టి తగుమాత్రం నీటిని అందించాలన్నారు. ఇప్పటికే వేరు కుళ్లు సోకిన తోటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై డీహెచ్ఓ వివరించారు. అంతకంటే ముందు గ్రామంలో సాగులో ఉన్న చీనీ తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



చీనీ తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి రవి చంద్రబాబు

ఐదేళ్ల నిర్లక్ష్యం..!



కడప - విజయవాడ రహదారికి సంబంధించి ఐదేళ్ల క్రితం చేపట్టిన పనులు నేటికీ ఓ కొలిక్కి రాకపోవడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలోని టక్కోలి, మాచుపల్లి, చంటిగారిపల్లె, మూలపల్లె, సిద్దవటం ప్రాంతాలకు చెందిన వారు ప్రయాణిస్తుంటారు. మూడు రోజులుగా వర్షాలు పడుతుండడంతో ఈ రోడ్డుపైనున్న గుంతల్లో నీరు నిలిచిపోయింది. ద్విచక్ర వాహనదారులు ఆ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఈ మార్గంలో టక్కోలులోని జిల్లా పరిషత్ హైస్కూలుకు వచ్చేందుకు విద్యార్థులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. తాము వెళ్లే సమయంలో ఆటోనో, ట్రాకరో వస్తే బురద నీరుపడి దుస్తులు అపరిశుభ్రంగా మారిపోతున్నాయని వాపోతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కడప



బురద నీటిలో వెళుతున్న విద్యార్థులు





గోతుల మధ్య ద్విచక్ర వాహనదారుల అవస్థలు

చికిత్స పొందుతూ మహిళ మృతి

కడపక్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అ ప్పులు చేయడంతో ఇబ్బందులు ఎదుర వుతున్నాయని చెప్పినా కొడుకు వినకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మ హత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు కడప నగరంలోని ఓంశాంతినగర్‌కు చెందిన ఉమామహేశ్వరి(52) కొడుకు సాయి ప్రసాద్ రెడ్డి విపరీతంగా అప్పులు చేశాడు. ఈ విషయంలో మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 17న ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను కర్నూలుకు తరలించగా చికిత్స పొందు తూ బుధవారం మృతి చెందినట్లు చిన్నచౌక్ పోలీసులు తెలిపారు.

రైతులు సంఘటిత సాగుకు మొగ్గుచూపాలి

ప్రొద్దుటూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత వ్యవసాయ పద్ధతులకన్నా, సంఘటితంగా సాగు చేయడం వలన పంట దిగుబడి, మార్కెటింగ్‌లలో మెరుగైన ఫలితాలు అందిపుచ్చుకోవచ్చని వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు బి.చంద్రానాయక్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు పంట సాగులో రసాయనాల వాడకాన్ని గణనీయంగా తగ్గించాలన్నారు. మిశ్రమ ఎరువులు వాడే సమయంలో యూరియాను చేర్చవద్దని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ, జాతీయ ఆహార భద్రత మిషన్ ద్వారా ప్రొద్దుటూరు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ రైతు సంఘం ద్వారా రైతులకు ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీ చేశారు. నూనెగింజల జాతీయ పథకం కింద వీసీసీ వేరుశనగ విత్తనాలను 30 కిలోల బరువుగల 510 బస్తాలను 102 మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, ఏడీఏ అనిత, ఏడీఏ అశోక్‌రెడ్డి, ఏవో వరహరికుమార్, సుస్థిర వ్యవసాయ కేంద్ర రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదినారాయణ, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈవో పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకండి



టీ దుకాణంలో టీ, కాఫీ పొడులను పరిశీలిస్తున్న కమిషనర్ రాముడు

పులివెందుల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దుష్పరిణామాలకు కారణమ వుతున్న ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలని మున్సిపల్ కమిషనర్ రాముడు ప్రజలకు విజ్ఞప్తి చేశా రు. బుధవారం పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. పలు హోటళ్లు, షాపుల్లో ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్‌తో భూమికి, మానవాళికి కలిగే హానిని వివరించారు. పలు టీ దుకాణాలను తనిఖీ చేశారు. నాణ్యమైన ఐఎస్ఐ మార్క్ కలిగిన టీ, కాఫీ పొడులను వాడాలని షాపు యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించాలి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి

పులివెందుల రూరల్, జూలై 23 (ఆంధ్ర జ్యోతి): రైతులు పెర్లకు మందులు పిచికారీ చేసేందుకు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకోవాలని మండల వ్యవ సాయాధికారి చెన్నారెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని ఇ.కొత్తపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలకు పురుగు మందులు పిచికారీ చేసుకోవచ్చన్నారు. దీంతో ఖర్చులు ఆదా అవు తాయన్నారు. పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పైర్ల వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం జీవా మృతం తయారు చేసి, ఏ విధంగా వాడాలో తెలియజేశారు. అన్ని రకాల పైర్లకు మొక్కకు కావాల్సిన అన్ని రకాల పోషకాల కోసం ఉపయోగపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ యామినీలత, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షక పంటలతో రసం పీల్చే పురుగు నివారణ



పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏఓ ఓబులేసు

వేముల, జూలై 23 (ఆంధ్ర జ్యోతి): వేరుశనగ పైరుకు రక్షణగా సజ్జ లేదా జొన్న పైరు చిక్కగా వేసుకుంటే రసంపీల్చే పురుగు ఉధృతి తగ్గుతుందని ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కెకె కొట్టాల గ్రామంలో ఏఓ ఓబులేసు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగలో జిప్సం వాడడం వలన నూనె శాతం, నాణ్యత పెరుగుతుందన్నారు. ఎకరాకు 200 కిలోలు జిప్సం వేసి మంచి ఫలితాలు పొందవచన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీహెచ్ఏ రాఘవరైతులుపాల్గొన్నారు.

ప్రశాంతంగా సింహాద్రిపురం మండల సమావేశం

సింహాద్రిపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు తమ పంచాయతీ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ కాసుల అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హెచ్చరించారు. ఉప మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేసీకి నీళ్లు.. ఆనందంలో రైతులు



కేసీ కెనాల్‌లో పరవళ్లు తొక్కుతున్న నీరు

మైదుకూరు రూరల్, జులై 23 (ఆంధ్రజ్యోతి) : కడప-కర్నూలు కాలువకు నీళ్లు రావడంతో ఆయకట్టు రైతులు ఆనందంతో పంటల సాగుకు ఉపక్రమించారు. ప్రతి ఏడాది ఆగస్టు మొదటి వారం కేసీ కాలువకు నీరు నిడుదల చేయడం ఆనవాయితీగా ఉండే ది. కానీ ఈ ఏడాది ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో అధికారులు జూలై నెల 15వ తేదిన నీరు విడుదల చేశారు కేసీ ఆయకట్టు కింద రైతులు పండించే ప్రధాన పంట వరిని సుమారు మూడు వేల ఎకరాలలో పండించేదుకు సంసిద్ధ మవుతున్నారు. దీంతో ప్రస్తుతం ఆయకట్టు కింద నారుమడులు వేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది వడ్లు క్వింటా ధర రూ.2,300లు మద్దతు ధర నిర్ణయించగా, ఈ ఏడాది ధర రూ.2,369 చేసింది. అందులో వర్షాలు కూడా మొదలయ్యాయి. దీంతో రైతులు వరి పంట వేయడంలో నిమగ్నమయ్యారు.

రాజకీయాలకతీతంగా..


హిందువులు ఐక్యం కావాలి



మాట్లాడుతున్న శశిభూషణ్‌రెడ్డి

పులివెందుల రూరల్, జూలై 23 (ఆంధ్ర జ్యోతి): రాజకీయాలకతీతంగా హిందువులంతా ఏకతాటిపైకి రావాలని హిందూ ఐక్యవేదిక జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. బుధ వారం పట్టణంలోని స్థానిక అంకాళమ్మ దేవ స్థానం మండపంలో హిందూ సంఘాలు, హిందూ ప్రముఖులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా ప్రాచీన కాలం నుంచి ఉన్న పోలే రమ్మ గుడిని తొలగించేందుకు ఒక వర్గం కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే ప్రతి చిన్న విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నా రని ఆరోపించారు. గతంలో ఎన్నడూలేని విధంగా గుడి ప్రాంగణంలో వారు నిర్మాణాలు చేపడ తామని, గుడికి కొంత భూమి మాత్రమే దానం చేస్తామ నడం ఏమిటని ప్రశ్నించారు. అసలు పులివెందుల పోలేరమ్మ గుడి ప్రాంగణం మొత్తం వారికి సంబంధం లేని విషయమైనప్పటికీ అక్కడ హిందువులు పూజలు చేయకుండా అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గుడి ప్రాంగణంలో విరిగిపోయిన త్రిశూలాన్ని ప్రతిష్టిస్తుంటే అభ్యంతరం వ్యక్తం చేయడం ఏమిటని ప్రశ్నించారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు శశిభూషణ్‌రెడ్డి, భానుప్రకాష్, జైహిందుస్థాన్ పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, హిందూ ఐక్యవేదిక జేఏసీ నాయకులు శ్రీనివాస రెడ్డి, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి జయంతికి విస్తృతంగా ఏర్పాట్లు



విద్యుద్దీపాలంకరణలో చౌడేశ్వరీదేవి ఆలయం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరీదేవి జయంతిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రామేశ్వరంలోని మోరీల వద్ద, వసంతపేట, వినాయకనగర్, ఆర్ట్స్‌కాలేజీరోడ్డు, పప్పులబజార్, విజయనగరం వీధి, సుబ్బిరెడ్డికొట్టాలు, మేదరవీధి, థర్మల్‌రోడ్డులోని అష్టభుజి మహాచౌడేశ్వరీదేవి ఆలయం, సూపర్‌బజార్ రోడ్డులోని చౌడేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవారి వేడుకలను వైభవంగా నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వివిధ ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేయనున్నారు.

జమ్మలమడుగులో: డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగులో గురువారం చౌడేశ్వరీదేవి జన్మదిన వేడుకలు నాగులకట్ట చౌడేశ్వరీదేవాలయం వద్ద వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీవారు తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 గంటలకు పట్టణంలోని పురవీధుల్లో భారీగా కలశం బిందెలతో గ్రామోత్సవం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన, లక్ష దీపాలంకరణ సేవ ఉంటుందన్నారు.

ఏఎన్‌ఎంలకు సన్మానం

దువ్వూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్నవారిని బుధవారం సన్మానించారు. ఏఎన్‌ఎంలు తులసీకుమారి, నరసమ్మ, మల్లీశ్వరి, మహదేవి, అంబికా, ప్రేమకుమారిలను వైద్యులు సురేష్‌బాబు, రోష్ని, హేమలత, సిబ్బంది పాల్గొని వారిని సన్మానించి వీడ్కోలు పలికారు.

కేసీకి నీళ్లు.. ఆనందంలో రైతులు



పరవళ్లు తొక్కుతున్న కేసీ కెనాల్‌లో నీరు

మైదుకూరు రూరల్, జులై 23(ఆంధ్రజ్యోతి) : కడప-కర్నూలు కాలువకు నీళ్లు రావడంతో ఆయకట్టు రైతులు ఆనందంతో పంటల సాగుకు ఉపక్రమించారు. ప్రతి ఏడాది ఆగస్టు మొదటి వారం కేసీ కాలువకు నీరు నిడుదల చేయడం ఆనవాయితీగా ఉండేది. కానీ ఈ ఏడాది ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో అధికారులు జూలై నెల 15వ తేదిన నీరు విడుదల చేశారు కేసీ ఆయకట్టు కింద రైతులు పండించే ప్రధాన పంట వరిని సుమారు మూడు వేల ఎకరాలలో పండించేదుకు సంసిద్ధమవుతున్నారు. దీంతో ప్రస్తుతం ఆయకట్టు కింద నారుమడులు వేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది వడ్లు క్వింటా ధర రూ.2,300లు మద్దతు ధర నిర్ణయించగా, ఈ ఏడాది ధర రూ.2,369 చేసింది. అందులో వర్షాలు కూడా మొదలయ్యాయి. దీంతో రైతులు వరి పంట వేయడంలో నిమగ్నమైయ్యారు.

వరి వేసుకొనే వారు జాగ్రత్తలు పాటించాలి

కేసీ ఆయకట్టు కింద వరి పంటలు పండించే రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి. వారం రోజుల ముందు సెంటు విస్తీరణంనకు గాను160 గ్రాముల చొప్పున కార్బోఫూరాన్ గుళికలను వేసుకోవాలని దీని వలన రసం పీల్చే పరుగులు, ఉల్లికోడు కాండం తొలుచు పురుగు నివారణకు చాలా బాగా ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా 80 శాతం సబ్సిడీలతో కిసాన్‌డ్రోన్లను పంపిణీ చేయడం జరుగుతుందని డ్రోన్ వాడటం వలన పెట్టుబడి ఖర్చులు చాలావరకు మిగిలే అవకాశమని ఉందని తెలిపారు.

-బాలగంగాధర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి, మైదుకూరు

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

అట్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. అట్లూరు మండలంలోని ముత్తుకూరు గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించారు, డీసీసీబీ ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి, టీడీపీ అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి, నాయకులు ఆరవ శ్రీనివాసులరెడ్డి, రెడ్డయ్య, సాంబశివారెడ్డి, కుప్పయ్య, సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, సూరారెడ్డి,బొబ్బిలయ్య, నరసింహారెడ్డి, చలమారెడ్డి, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం : భూపేశ్



దొబ్బుడుపల్లెలో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం/మైలవరం, జూలై 23 (ఆంధ్ర జ్యోతి): రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని జమ్మలమ డుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలో దొబ్బుడుపల్లెలో బుధవారం నిర్వహించిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎస్‌ఎమ్ ఈఓటీ-ఎస్‌ఓ పథకం కింద 198 మంది రైతులకు 9.8 క్వింటాళ్ల ఆముదాలు, 210 మంది రైతులకు 8.1 క్వింటాళ్ల కందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం దొబ్బుడుపల్లె గ్రామంలో ఆయన ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా మైలవరం మండల పరిధిలోని లింగాపురం తాండ, బొగ్గుల దాసరిపల్లెల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం భూపేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లల హక్కులతోపాటు రక్షణ కల్పించాలి

జమ్మలమడుగు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బాలల పరిరక్షణతోపాటు మానసిక సామాజిక రక్షణ కల్పించాలని జమ్మలమడుగు తహసీల్దారు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలతో ప్రభుత్వ సూచనల మేరకు మిషన్ వాత్సల్య పథకం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లలు, వీధి పిల్లలు బాల్య దుర్వినియోగానికి గురైన పిల్లల విషయంలో ఇతర ఆపదల్లో ఉన్న పిల్లలకు రక్షణ, సంరక్షణ సదుపాయాలు అందించడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో , అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పిల్లలందరినీ చదివించాలి

పోరుమామిళ్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పిల్లలందరిని చదివించుకోవాలని ఏపీఎం వీరాంజనేయులు అన్నారు. బుధవారం స్త్రీశక్తిభవనంలో పోరుమామిళ్లలోని 48 గ్రామ సంఘాలకు సంబంధించిన అధ్యక్షులకు వీవోఏలకు ఏపీయం ఆధ్వర్యంలో విలేజ్ ప్రావర్టీ రిడక్షన్ ప్లాన్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ సీసీ పిచ్చయ్య, సీసీలు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసులు

మైలవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపరాల గ్రామానికి చెందిన నగళ్లపాటి శ్రీనివాసులును బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈయన 12 సంవత్సరాలుగా మైలవరం మండల బీజేపీ అధ్యక్షుడిగా కొనసాగారు. ఆయన సేవలను గుర్తించి ప్రస్తుతం నూతన బీజేపీ కమిటీలో జిల్లా సెక్రటరిగా పదవీ బాధ్యతలు అప్పగించారు.

బీసీలకు 43 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న స్వర్ణభారత్ ప్రజాపార్టీ నేతలు

ప్రొద్దుటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బీసీలపార్టీ అనే చెప్పుకునే టీడీపీ ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ తరహా 43 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని స్వర్ణభారత్ ప్రజాపార్టీ వ్యవస్థాపకుడు శిలివేరు దశరథరామయ్య డిమాండ్ చేశారు. ఆమేరకు బుధవారం తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీయేలో కీలక భాగస్వామ్యంగా ఉన్న టీడీపీ కేంద్రం త్వరిత గతిన కులగణన జరపేందుకు కృషి చేయాలన్నారు. అప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో బీసీలకు 43 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో 43 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆపార్టీనేతలు కాలే దేవానంద్, రంగా నాగార్జున ,బోడలగల రాజు తదితరులుపాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



సీఎం సహాయనిధిచెక్కు అందిస్తున్న బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

అట్లూరు/కలసపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి చెక్కుల ను బద్వేలు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ బుధవారం బాధితులకు అందజేశారు. ఇందులో అట్లూరు మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన దేవిరెడ్డి సుందరమ్మకు సీఎం సహాయనిధి రూ.4,36,500 చెక్కును బద్వేలు టీడీపీ కార్యాలయంలో అందించారు. వంశీక్రిష్ణారెడ్డి రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యానికి సీఎం చంద్రబాబు సహాయనిధి నుంచి బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె తనయుడు రితీష్‌కుమార్‌రెడ్డి, అట్లూరు టీడీపీ మండల అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి తమకు ఆర్థికసాయం అందించిందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిలిపి క్రిష్ణారెడ్డి, శివ ఉన్నారు. కాగా కలసపాడుకు చెందిన సతీష్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తికి బుధవారం రూ.48వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దాదాన భూపాల్‌రెడ్డి, టీడీపీ యువనాయకు డు శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గుచూపాలి



రైతు సేవా కేంద్రం వద్ద జీవామృతం తయారీ దృశ్యం

కలసపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతివ్యవసాయంపై మొగ్గుచూపాలని వ్యవసాయశాఖ అధికారి చంద్రమోహన్‌రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. కలసపాడు మండల పరిధిలోని లింగారెడ్డిపల్లెలో వ్యవసాయశాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో బుధవారం ఖరీఫ్‌లో సాగుచేసే వరి, ఉల్లి,మినుము, కం ది పంటలలో పీడపీ డలుయాజమాన్య పద్ధతులపై వివరించారు. ఉద్యానవన శాఖ అధికారి శ్రీని వాసులరెడ్డి మాట్లాడుతూ 90శాతం సబ్సిడీతో సూక్ష్మసేద్య పరికరాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. బీటీఎం శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయాధికారి సింగరయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీలక్ష్మి, రాజశేఖర్‌రెడ్డి, అంకిరెడ్డి, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

క్రాప్ ఇన్సూరెన్స్‌కు పంట నమోదు ప్రామాణికం

కాశినాయన జూలై23(ఆంధ్రజ్యోతి) ప్రకృతి విపత్తుల్లో పంట నష్టపోయిన రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ సాయం అందాలంటే పంటనమోదు ప్రక్రియనే ప్రామాణికంగా తీసుకుంటారని మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఇటుకులపాడులో ఏఈవో రవి ఆధ్వర్యంలో ఏవో చంద్రమోహన్ మాట్లాడుతూ పంటలు సాగుచేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామసచివాలయ విఏఏలు పలువురు రైతుల పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు రావాలంటూ ఎమ్మెల్యేకు ఆహ్వానం

మైదుకూరు రూరల్, జులై 23(ఆంధ్రజ్యో తి) :తిరుమలనాథస్వామి ఆలయ గిరి ప్రదక్షిణకు రావాలంటూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ని ఆలయ ధర్మకర్త హజ రత్‌రెడ్డి, టీడీపీ నాయకుడు పోలి మేర శివశంకర్‌రెడ్డిలు ఆహ్వానించారు. శావణ పౌర్ణమి రోజున అనగా ఆగస్టు 9వ తేదీన తిరుమలనాథస్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమానికి అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి తో పాటు పలువురు హాజరవుతున్నాట్లు వారు తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

బద్వేలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు శివారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్యలు అన్నారు. సీపీఐ జిల్లా మహాసభలు మూడవ రోజు బుధవారం కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ నిరుద్యోగులను, మోసం చేస్తున్న నరేంద్రమోదీ సర్కారును గద్దెదింపకపోతే భవిష్యత్తులో నిరుద్యోగ వ్యవస్థ పెరిగిపోతుందన్నారు. జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ కడప ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, పి.వి.రమణ, రామయ్య బాదుల్లా, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేటలో విద్యాసామగ్రి పంపిణీ



ఖాజీపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీలోని యానాది కాలనీలో అమ్మసేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంఈవో నాగస్వర్ణలత చేతుల మీదుగా విద్యాసామగ్రి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేద విద్యార్థుల కోసం దాతలు ముందుకొచ్చి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు ప్రతాప్, నాగరాజు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ ప్రవల్లిక పాల్గొన్నారు.

రైతులు సంఘటిత సాగుకు మొగ్గుచూపాలి



ఉచితంగా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న జేడీఏ, నంద్యాల కొండారెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత వ్యవసాయపద్ధతులకన్నా రైతన్నలు సంఘటితంగా సాగు చేయడం వలన పంట దిగుబడి, మార్కెటింగ్‌లలో మెరుగైన ఫలితాలు అందిపుచ్చుకోవచ్చని వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు బి.చంద్రానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు పంట సాగులో రసాయనిక వాడకాన్ని గణనీయంగా తగ్గించాలన్నారు. మిశ్రమ ఎరువుల వాడే సమయంలో యూరియాను చేర్చవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ, జాతీయ ఆహార భద్రత మిషన్ ద్వారా ప్రొద్దుటూరు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ రైతు సంఘం ద్వారా రైతులకు ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నూనెగింజల జాతీయ పథకం కింద వీసీసీ వేరుశనగ విత్తనాలను 30 కిలోల బరువుగల 510 బస్తాలను 102 మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, ఏడీఏ అనిత, కడప డీఆర్‌సీ ఏడీఏ అశోక్‌రెడ్డి, ఏవో వరహరికుమార్, సుస్థిర వ్యవసాయ కేంద్ర రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదినారాయణ, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈవో పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్లపాడు ఉన్నత పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

కాశినాయన జూలై23(ఆంధ్రజ్యోతి): కోడిగుడ్లపాడు జడ్పీఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి శంషుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల స్థితిగతులపై ఇన్‌చార్జి ప్రదానోపాధ్యాయుడు రవీంద్రబాబును అడిగితెలుసుకున్నారు. అనంతరం 10వతరగతి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. అలాగే మద్యాహ్న భోజనంపై ఆరాతీశారు. ఆయన వెంట జిల్లా పదవతరగతి ప్రైవేట్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

పేదల సాధికారతే పీ4 ముఖ్య ఉద్దేశ్యం



ప్రసంగిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అట్టడుగున ఉన్న పేదల సాధికారతకే పీ4 ఏర్పాటు ముఖ్య ఉద్దేశ్యమని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం మడకలవారిపల్లె, ఆంజనేయనగర్‌లో పీ4 పై వార్డు సభలు నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కమిషనర్ మాట్లాడుతూ సంపద అధికంగా ఉన్న కుటుంబాలు అట్టడుగు ఉన్న కుటుంబాలకు సపోర్టుగా నిలబడడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అర్హత కలిగిన వారి పేర్లు లేకుంటే సచివాలయ సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవచ్చన్నారు.

సింగిల్ యూజ్‌ప్లాస్టిక్‌ను పూర్తిగా అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రొద్దుటూరు , జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో అరికట్టాలని లేకుంటే పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో ప్లాస్టిక్ నియంత్రణపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగించే ప్రతి దుకాణంపై తోపుడు బండ్లపై దాడులు చేసి జరిమానాలు విధించాలన్నారు. హోల్‌సేల్ షాపులను సీజ్ చేయాలన్నారు. సచివాలయ పరిధిలో దాడులకు సమష్టిగా పనిచేయాన్నారు.

బద్వేలులో: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బదులు బయోడిగ్రేడబుల్ కవర్లు వాడాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన పలు ప్లాస్టిక్ వస్తువులను విక్రయించే షాపులను సిబ్బందితో కలిసి తనిఖీ చేసి వారికి పలు రకాల సూచనలు చేశారు. అలాగే సెక్రటరీలు మీ పరిధిలోని షాపులను తరచుగా తనిఖీ చేయాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ, శానిటేషన్ నందు ఎలంటి గ్యాప్ లేకుండా చూడడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎవరైనా సిబ్బంది నిర్లక్ష్యంగా వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఎమ్మెల్యే వరదకు తులసిరెడ్డి పరామర్శ



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని పరామర్శిస్తున్న తులసిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పరామర్శించారు. బుధవారం కామనూరులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయను పరామర్శించారు. ఇటీవలనే ఎమ్మెల్యే గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని వచ్చారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి ఎమ్మెల్యే ఆరోగ్యంను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని, వీలైనంత త్వరగా ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేకు సుదీర్ఘరాజకీయ చరిత్ర ఉందని, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం ప్రజల అండదండలు ఉండడంవల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి పీఎండీ నజీర్, రాఘవరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాగరాజు, సుబ్బారెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు జిల్లాను ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసేటట్లయితే ప్రొద్దుటూరు కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాల పేర్ల మార్పులపై ప్రభుత్వం పునరాలోచిస్తోంది, ఒకవేళ కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తే ప్రొద్దుటూరు జిల్లాను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటుకు అవసరమైన అన్ని వనరులు, వసతులు, తగిన ప్రాధాన్యత ప్రొద్దుటూరుకు ఉందన్నారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు టప్పా మహబూబ్‌బాష, రామూనాయుడు పాల్గొన్నారు.

భావనారాయణ నగర్‌లో విద్యుత్ వెలుగులు

బద్వేలుటౌన్, జులై 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భావనారాయణనగర్ ఎస్సీకాలనీలకు ఎట్టకేలకు విద్యుత్ వెలుగులు వచ్చాయి. గత 10సంవత్సరాలుగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు లేక చీకటిలో పేదలు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ సమస్యను అక్కడున్న టీడీపీ నాయకులు పెద్దన్న, ప్రహ్లాద, శంకర్‌రెడ్డి, రామయ్యలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించినవారు విద్యుత్‌శాఖ ఏఈతో మాట్లాడి ఆ కాలనీలో స్తంభాలను ట్రాన్స్‌ఫార్మర్ ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా అయ్యేలా చేయడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు, రితేష్‌రెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థి నోటు పుస్తకాలు వితరణ



పోరుమామిళ్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామేశ్వరం ప్రభుత్వ పాఠశాలలోని 65 మంది విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వవిద్యార్థి బత్తల రవి నోటు పుస్తకాలు, పెన్నులు వితరణ చేశారు. బుధవారం ఆయన ఆ పాఠశాలను సందర్శించారు. ప్రస్తుతం తాను సింగపూర్‌లో పనిచేస్తున్నానని, తన కుమార్తె లేక్షణ పుట్టినరోజు సందర్భంగా మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి, బ్రహ్మ, ఇటీవల పదవీ విరమణ చేసిన ముత్తుమల రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.